సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 1 । మే । 2025



ఆటాడుకుందాం రా..!

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- 8లో



సదరం.. కలకలం

సదరంలో కలకలం రేగింది. నరసన్నపేటలో నలుగురు వైద్యులపై కేసు నమోదైంది.

- 8లో

విధుల్లోకి చేరిన న్యాయమూర్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఇటీవల బదిలీపై వచ్చిన ప్రిన్సిపల్‌ సివిల్‌ జడ్జి (సీనియర్‌ డివిజన్‌) మణిపాటి శ్రీధర్‌, అదనపు సివిల్‌ జడ్జి (సీనియర్‌ డివిజన్‌) శాంతిశ్రీ బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో విధుల్లోకి చేరారు. సిబ్బంది సాదరంగా స్వాగతించారు.

న్యూస్‌రీల్‌

‘ప్రజల భద్రత గాలికి’



ధర్మాన కృష్ణదాస్‌

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం ప్రజల భద్రతను గాలికి వదిలేసిందని, ఇటీవలే తిరుపతి తొక్కిసలాటలో కొందరు చనిపోయారని, ఇప్పుడు సింహాచలంలోనూ భక్తులు ప్రాణాలు కోల్పోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాల్లో ఉత్సవాలు జరిగేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. గాయపడిన వారికి మంచి వైద్యం అందించాలని, వాళ్లు తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సింహాచలం ఘటన బాధాకరం



ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం రూరల్‌: సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవానికి వచ్చిన భక్తులపై గోడ కూలి కొందరు భక్తులు చనిపోవడంపై ఎమ్మెల్సీ నర్తు రామారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోదావరి పుష్కరాలు, తిరుపతిలో తొక్కిసలాట, వందల సంఖ్యలో గోవుల మృతి, శ్రీకూర్మంలో తాబేళ్ల మృతి, ఇప్పుడు సింహాచలంలో దుర్ఘటన అన్నీ టీడీపీ హయాంలోనే జరుగుతున్నాయని గుర్తు చేశారు. భక్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. దీనికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్‌ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్‌ ప్రవేశ పరీక్ష



ఎచ్చెర్లలో పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఏపీ పాలిసెట్‌–2025 జిల్లాలో బుధవారం సజావుగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. టెక్కలి, శ్రీకాకుళం డివిజన్ల పరిధిలో 39 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. జిల్లా నుంచి 11373 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 10217 మంది హాజరయ్యారు. శ్రీకాకుళం డివిజన్‌లో 6973 మందికి 6183 మంది, టెక్కలి డివిజన్‌లో 4400 మందికి 4034 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను ప్రవేశాల జిల్లా ఇన్‌చార్జి బి.జానకి రామయ్య, జిల్లా అబ్జర్వర్‌ కె.విజయలక్ష్మి, టెక్కలి అబ్జర్వర్‌ గోవిందరావు, శ్రీకాకుళం అబ్జర్వర్‌ కె.రత్న కుమార్‌ పరీక్షలు పర్యవేక్షించారు.

పి-4 సర్వే ద్వారా 75,566 కుటుంబాల గుర్తింపు



శ్రీకాకుళం పాతబస్టాండ్‌: పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి–4 విధానాన్ని జిల్లాలో ప్రభావవంతంగా అమలు చేస్తున్నట్టు కలెక్టర్‌ స్వప్నిల్‌ దింకర్‌ పుండ్కర్‌ తెలిపారు. సమాజంలో ఆర్థికంగా అట్టడుగున ఉన్న 20 శాతం వెనుకబడిన కుటుంబాలను ‘బంగారు కుటుంబాలు’గా గుర్తించామని, జిల్లాలో మొత్తం 75,566 కుటుంబాలు ఈ దిశగా ఎంపికయ్యాయని వెల్లడించారు. వీరిని సమాజంలో ఉన్నత స్థితికి చేర్చేందుకు 10 శాతం మంది ‘మార్గదర్శులు’గా ముందుకు వచ్చి, ఒక్కో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకుని వారికి విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఇతర అవసరాల కోసం తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. దీని ద్వారా ప్రభుత్వ–ప్రైవేట్‌–ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలనుకునే వారు zeropovertyp4.ap.gov.in వెబ్‌సైట్‌ ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్‌ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం, దేశం నలుమూలలలో ఉన్న శ్రీకాకుళం వాసులు ముందుకు రావాలని ఆయన కోరారు.

తమ్ముళ్లకు వెన్నుపోటు



- నరసన్నపేట నియోజకవర్గ కీలక నేత చేతిలో మోసపోయిన తెలుగు తమ్ముళ్లు
- మద్యం వ్యాపారంలో వాటాలిస్తామని రూ. 20కోట్లకు పైగా సేకరణ
- వసూలయ్యాక మాట మార్చిన కీలక నేత
- లబోదిబోమంటున్న తమ్ముళ్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ప్రైవేటు మద్యం దుకాణాలు వస్తున్నాయనగానే తెలుగు తమ్ముళ్లు సంబరపడ్డారు. ఎవరికీ దక్కకుండా దుకాణాలు కొట్టేద్దామని భావించారు. నాయకులంతా సిండికేటై దుకాణాలన్నీ గుప్పెట్లోకి తెచ్చుకోవాలని కలలు కన్నారు. ఇంకేముంది నరసన్నపేట నియోజకవర్గ కీలక నేత సిండికేట్‌కు నాయకత్వం వహించారు. అంతా కలిసి వ్యాపారం చేసుకుందామని గ్రామాల వారీగా నాయకుల నుంచి పెట్టుబడి కింద రూ. 20కోట్లకు పైగా వసూలు చేశారు. కానీ అనుకున్నదొకటైతే జరిగింది మరొకటి అయింది. డబ్బులిచ్చిన నాయకుల పేరున కాకుండా తన కుటుంబ సభ్యుల చేత నియోజకవర్గంలోని దుకాణాలకు దరఖాస్తు చేయించారు. వాటిలో కొన్ని దుకాణాలు లాటరీలో వారికే దక్కాయి. ఇతరులకు వచ్చిన మరికొన్ని దుకాణాలను భయపెట్టి తన సిండికేట్‌లో కలిపేసుకున్నారు. అంతా అయ్యాక సిండికేట్‌ వ్యాపారం కోసం గ్రామాల వారీగా భారీగా డబ్బులిచ్చిన నాయకులను విస్మరించారు. వ్యాపారంలో కలుపుకోకపోగా వారిచ్చిన డబ్బులు కూడా వెనక్కి ఇవ్వడం లేదు. పెట్టుబడి కోసం వివిధ వ్యక్తుల వద్ద వడ్డీలకు తీసుకొచ్చిన సొమ్ము ఆ కీలక నేత చేతిలో ఉండిపోయిందని లబోదిబోమంటున్నారు.

ఫ్యామిలీ ప్యాకేజీ..

నరసన్నపేట నియోజకవర్గంలో కీలక నేత పంట పండింది. అటు మద్యం, ఇటు ఇసుక ద్వారా రోజుకి రూ.కోట్లలో ఆర్జిస్తున్నారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న ఆ నేత రెండు చేతులా సంపాదిస్తున్నారు. కానీ, ఆయన్ని నమ్మి వెనుక నడిచిన నాయకులు మాత్రం చాలా వరకు మోసపోయారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టపోతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అక్కడి కీలక నేత ఒకరు అంతా తానై వ్యవహరించారు. మద్యం వ్యాపారం కలిసి చేసుకుందామని నమ్మబలికి నాయకుల దగ్గరి నుంచి రూ. 20కోట్లకు పైగా సొమ్ము సేకరించారు. డబ్బులిచ్చిన ప్రతి ఒక్కరికీ వ్యాపారంలో వాటా ఇస్తామని చెప్పారు. నాయకుల పేరునే దుకాణాల కోసం దరఖాస్తులు చేయిస్తామని భరోసా ఇచ్చారు. కానీ, దరఖాస్తుల ప్రక్రియకు వచ్చేసరికి తన కుటుంబ సభ్యుల పేరున ఎక్కువగా దరఖాస్తులు చేశారు. ఒక్కో దుకాణానికి 30నుంచి 70వరకు దరఖాస్తులు చేసినప్పటికీ ఆ కుటుంబ సభ్యులకే లాటరీలో ఎక్కువగా దుకాణాలు వచ్చాయి.

హ్యాండ్‌ ఇచ్చిన కీలక నేత

దుకాణాలు దక్కాక ఆ నేత మొహం చాటేస్తున్నారు. వాటా సంగతేంటని అడిగితే దాటవేస్తున్నారే తప్ప లబ్ధి చేకూర్చడం లేదు. ఎప్పటికీ వాటాలు ఇవ్వడం లేదని కొందరు విసిగిపోయి అడుగుతుంటే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. తరచూ అడిగే వాళ్లకు వడ్డీతో కలిపి చెల్లించేస్తానని చెప్పడమే తప్ప వెనక్కి ఇచ్చిన దాఖాల్లేవు. ఒకవైపు వడ్డీలు పెరిగిపోతున్నాయి, మరోవైపు కీలక నేత వెనక్కి ఇవ్వడం లేదు. దీంతో నాయకులంతా కుమిలిపోతున్నారు. గట్టిగా అడిగితే అధికారం ఉండటంతో ఏం చేస్తారోనన్న భయంతో ప్రాధేయ పడుతూ వస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సమావేశాలు పెట్టుకుని కీలక నేత తీరుపై ఆవేదన వ్యక్తం చేయడమే కాకుండా ఏం చేస్తే...ఆ డబ్బులు వెనక్కి వస్తాయో అన్నదానిపై సమాలోచనలు చేస్తున్నారు.

కావాల్సిన వారికి ఇసుకలో వాటా

మద్యం వ్యాపారం కోసం డబ్బులిచ్చిన వారిలో తనకు కావాల్సిన కొందరికి మాత్రం ఇసుకలో వాటాలిచ్చారు. తప్పని పరిస్థితుల్లో అనధికారికంగా నడిపే ర్యాంపుల్లో కొంత పర్సంటేజీ ఇచ్చారు. పైసా పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో ఇసుక ర్యాంపులను కీలక నేత వదిలేశారు. ముఖ్యంగా నరసన్నపేట, పోలాకి, జలుమూరు తీర ప్రాంత గ్రామాలకు చెందిన నాయకుల్లో బలమైన వ్యక్తులకు మాత్రమే ఈ ఆఫర్‌ ఇచ్చారు. మిగతా వారిని సముదాయిస్తూ వస్తున్నారు. ఒకే దుకాణానికి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వేయడం వల్ల ఆ ఫీజు కింద చాలా వరకు పోయిందని, అనుకున్నంతగా లాభాలు కూడా రావడం లేదని, ఇప్పుడిప్పుడే బెల్ట్‌ దుకాణాల ద్వారా ఆదాయం పెరిగిందని, త్వరలోనే వ్యాపారం కోసం ఇచ్చినదంతా వెనక్కి ఇచ్చేస్తానంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఇప్పుడా నేత తీరుపై మిగతా ప్రజలు పక్కన పెడితే సొంత నాయకులే కస్సుబుస్సులాడుతున్నారు.



ధార గట్టిన వారి చెమట చుక్కలే విశ్వరథానికి ఇంధనాలు. బిగుసుకున్న ఇనుప కండరాలే ప్రగతి పర్వానికి పునాదులు. ఉబ్బెత్తున కనిపించే ఉక్కు నరాలు రేపటి బాటకు దిక్సూచికలు. కార్మికుడి నినాదం నేటికీ ఎక్కడో ఓ చోట వినిపిస్తూనే ఉంది. బండెడు బాధ్యతలు మోస్తున్నా పొందాల్సిన హక్కులకు దూరమైపోయిన శ్రామికుడి ఆవేదన సిక్కోలులోనూ కనిపిస్తోంది. మేలు జరిగిన నాడే మేడే స్ఫూర్తి అందుకున్నట్టు అని శ్రామికులంటున్నారు.

మేలు జరిగిన నాడే..

- అందని ద్రాక్షగా కార్మిక సంక్షేమ పథకాలు
- జిల్లాలో సుమారు 5.6లక్షల మంది కార్మికులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నేడు మేడే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కష్టపడి పనిచేసే శ్రామికుడికి సిక్కోలు కేరాఫ్‌ అడ్రస్‌. నిర్మాణరంగ కార్మికులు, రవాణారంగ కార్మికులు, షాపుల్లో పనిచేసే వారు, స్కీమ్‌ వర్కర్లు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులంతా జిల్లాలో దాదాపుగా 5.60లక్షలకు పైగా ఉన్నారు. వీరిలో చాలా మంది వలస వెళ్లిపోయిన వారు ఉన్నారు. కానీ ఏటా వీరి శ్రమ పెరుగుతుందే తప్ప.. పథకాలు చేతికి అందడం లేదు. కనీస వేతనాల జీఓ సవరించక పోవడంతో ఏడాదికి కార్మికులంతా రూ.600కోట్లు కోల్పోతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టం నిధులను చంద్రన్న బీమాకు మళ్లించి భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికులకు భారీగా ఫీజులు, పెనాల్టీలు వేస్తు న్నారు. ఆశ, అంగన్‌వాడీలపై ఉన్న పనిభారం, వారికి ఇచ్చే వేతనానికి ఉండే వ్యత్యాసం అందరికీ తెలిసిందే.

అవగాహన లోపం..

కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ఉన్నాయి. కానీ వాటిపై అవగాహన లేకపోవడంతో ఆ లబ్ధిని పొందలేకపోతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న కార్మిక సంక్షేమ పథకాలు తెలుసుకోవాలన్నా, క్లెయిమ్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు చెబుతున్నారు.



వంద పడకల ఆస్పత్రి కావాలి

కార్మికులకు పైడిభీమవరంలో 100 పడకల ఆస్పత్రి నిర్మించాలి. మూతపడిన జ్యూట్‌మిల్లను, ఆమదాలవలస చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలి. మూతపడిన పరిశ్రమలను ప్రభుత్వం తెరిపించకుండా కొత్త పరిశ్రమల పేరుతో రైతుల వద్ద నుంచి వేలాది ఎకరాలను తీసుకుని వ్యాపారం చేయడం మానుకోవాలి. – డి.గోవిందరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి



పాతచట్టాలు కొనసాగించాలి

29 కార్మికుల పాత చట్టాలు రద్దుపరచకుండా వాటినే కొనసాగించాలి. 29 చట్టాల్ని నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కుల్ని హరించే ప్రయత్నం చేస్తున్నారు. కార్మికులందరికీ కనీస వేతనాలు బోర్డుని పునరుద్ధరించాలి. కార్మికుల కోసం సేకరించిన నిధుల్ని, సెస్‌లను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఉపయోగించాలి. ఈపీఎఫ్‌ కార్మికులకు రూ.9వేలు పెన్షన్‌ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. – సీపాన వెంకటరావు, రిటైర్డ్‌ అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌





వైశాఖం వచ్చినా.. మీనమేషాలేనా.?

- అరసవల్లిలో కానరాని ఏర్పాట్లు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు

అరసవల్లి: వైశాఖ మాసం వచ్చేసింది. ఈ మాసంలో అరసవల్లి ఆదిత్య క్షేత్రంలో ప్రత్యేక సందడి నెలకొంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలి వస్తుంటారు. కానీ అందుకు తగ్గట్టు భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన రథసప్తమి మహోత్సవాలు సందర్భంగా ఆలయం ముందు భాగంలో ఉన్న నిర్మాణాలు, షెడ్లు అన్నింటినీ తొలగించేసిన సంగతి విదితమే. ఇప్పుడు ఎండ తీవ్రత పెరిగిపోతున్న క్రమంలో భక్తులకు ఎండ దెబ్బలు తప్పవని అర్థమవుతోంది. ఆలయంలో గత వైశాఖ మాసానికి వేలల్లో భక్తులు తరలి వచ్చినప్పటికీ అందుకు తగిన షెడ్లు, మరుగుదొడ్లు, ఇతరత్రా వసతి ఏర్పాట్లు ఉండడంతో ఇబ్బందులు కలుగలేదు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది.

ఆలయం ముందు నిర్మాణాలు, షెడ్లు తొలగించేయడంతో పాటు అన్నదాన ప్రసాదం, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాలు కూడా తాత్కాలికంగా మారాయి. దీంతో భక్తులు గత మూడు నెలలుగా అవస్థలు పడుతూనే ఉన్నారు. ఎండ అవస్థలతో పాటు మౌలిక వసతులు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఆలయం ముందు మంచినీటి పంపిణీకి, భక్తులు సేద తీరడానికి చిన్నపాటి పందిళ్లతో సరిపెట్టిన ఆలయ అధికారుల తీరు రోజురోజుకీ వివాదాస్పదమవుతోంది.

మూడు నెలల కిందట కూల్చేసిన షెడ్ల భాగాలతోనే ఇంద్రపుష్కరిణి ఒడ్డున అన్నదానం కోసం ఓ షెడ్డును వేసి మిన్నకుండిపోయారు. మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా తాత్కాలికంగానే ఏర్పాటు చేయడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జింకు రేకులతో మరుగుదొడ్లు వేయడంతో ఈ వేసవిలో వైశాఖ మాసంలో అవస్థలు తప్పేలా లేవు. దుకాణాలు కూల్చేసేటప్పుడు చెప్పిన హామీలను అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదంటూ వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలంటూ ఆలయ షాపింగ్‌ కాంప్లెక్స్‌ బాధితులు కోరుతున్నారు.

కొందరికే కొత్త పింఛన్లు

- పాత ఐడీ ఉన్న వితంతువులకే పింఛన్లు
- ఐడీ లేని విడోలకు పింఛను లేదు
- కొత్త పింఛన్లకు నోచుకోని దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు
- 50 ఏళ్ల పింఛన్‌ హామీ బూటకమే



శ్రీకాకుళం పాతబస్టాండ్‌: కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లలోనూ మెలికలు పెడుతోంది. ఎన్నికలు జరిగిన నాటి నుంచి దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు పింఛన్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటే కొందరికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఇప్పటి వరకు గత ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లు తప్ప కొత్తవారికి ఒక్క పింఛను ఇవ్వలేదు. కేవలం పింఛను పెంచామని కూటమి పాలకులు బాకాలు ఊదుతున్నారు తప్ప కొత్త వారి పరిస్థితిపై ఎవరూ మాట్లాడటం లేదు.

50 ఏళ్ల పింఛన్‌ ఊసే లేదు

- ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే పింఛన్‌ ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు దానిపై ఎలాంటి కసరత్తు చేయలేదు.
- దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మెడికల్‌ పింఛను దారులు వేల సంఖ్యలో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ఎవరినీ ప్రభుత్వం కరుణించలేదు.
- తాజాగా ప్రభుత్వం వితంతు పింఛను మంజూరుకు అనుమతులు ఇచ్చింది. దీంతో చాలా మంది వితంతువులకు పింఛను వస్తుందని ఆశపడ్డారు. అయితే దీనిలో మెలిక పెట్టారు. గతంలో పింఛను పొంది, ఆ వ్యక్తి పింఛన్‌ ఐడీ కలిగి ఉండి, ఆయన మరణిస్తే అతని భార్యకు మాత్రమే వితంతువు పింఛను ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చారు. భర్త పింఛను భార్యకు తప్ప ఇతర వితంతువులకు పెన్షన్‌ వచ్చే పరిస్థితి లేదు.
- మే నెలకు గాను జిల్లాకు 3.10 లక్షల పింఛన్లు విడుదలయ్యాయి. ఈ పింఛన్లు గత ఏడాదిగా ప్రతి నెలా తగ్గుతూ వస్తున్నాయి.
- ఇవన్నీ పాత పింఛన్లే. కొత్తగా చనిపోయిన వారి స్థానంలో 4623 పింఛన్లు మంజూరు కావాల్సి ఉండగా.. వీటిలో కూడా కోత పెట్టేందుకు ప్రభుత్వం సాకులు వెతుకుతోంది.
- జిల్లాలో గత ఏడాదిన్నరగా 4623 మంది పింఛన్‌దారులుమరణించినట్టు చెబుతున్నారు. అయితే వీరి ఐడీల ద్వారా వారి భార్యలకు (స్పౌజ్‌) లో 2911 పింఛన్లు మాత్రమే ఇవ్వనున్నారు.
- ఒక కుటుంబంలో భర్త పింఛను పొందుతూ 01.12.2023 నుంచి 31.10.2024 మధ్య మరణిస్తే.. అలాంటి పింఛనుదారు భార్యకు మాత్రమే వితంతు పింఛను మంజూరు చేశారు. ఇతరులకు మొండి చేయిచూపారు.
- భర్త పింఛన్‌దారుడు కాకపోతే.. వితంతువైనా పింఛన్‌ కోసం దరఖాస్తు చేసేందుకు అనుమతులు లేవు.

మెయిన్స్‌ షెడ్యూల్‌ మార్చాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: మే మొదటి వారంలో జరగనున్న ఏపీపీఎస్సీ మెయిన్స్‌ పరీక్షల షెడ్యూలును మార్చాలని అఖిలభారత యువజన సమాఖ్య ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు బుధవారం జాయింట్‌ కలెక్టర్‌ ఫర్మాన్‌ అహ్మద్‌ ఖాన్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూపీఎస్సీ సివిల్‌ సర్వీసెస్‌ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులపై విద్యాపరమైన, భావోద్వేగ ఒత్తిడిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అధికారిక యూపీఎస్సీ క్యాలెండర్‌ ప్రకారం, ప్రిలిమినరీ పరీక్ష మే 25న, మెయిన్‌ పరీక్ష ఆగస్టు చివరి వారంలో నిర్వహిస్తారని చెప్పారు. ఏపీపీఎస్సీ గ్రూప్‌1 మెయిన్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులలో చాలా మంది సివిల్‌ సర్వీసెస్‌ పరీక్షపైనా దృష్టి పెడతారన్నారని, తక్కువ రోజుల వ్యత్యాసం ఉన్నందున అభ్యర్థులు ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ నాయకులు యుగంధర్‌, బొత్స సంతోష్‌, శ్రీనివాస్‌, వేణు పాల్గొన్నారు.



ఈదురు గాలులకు రోడ్డుపై కూలిన మర్రి చెట్టు

వాయు విధ్వంసం

జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు రాకాసి గాలులు విధ్వంసం సృష్టించాయి. అర్ధరాత్రి దాటాక మొదలైన ఈదురు గాలుల బీభత్సం వేకువజాము వరకు కొనసాగింది. ఈ ధాటికి అనేక చోట్ల చెట్లు, విద్యుత్‌స్తంభాలు, హోర్డింగులు నేలరాలాయి. అరటి, మామిడి వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

రోడ్డుపై కూలిన మర్రి చెట్టు

మందస: బుధవారం తెల్లవారుజామున వీచిన భారీ గాలులకు మందస మండలం సొండిపూడి–ముకుందపురం గ్రామాల మధ్య భారీ మర్రిచెట్టు కూలిపోయింది. దీంతో చాలాసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

ధాన్యం..దైన్యం



పీఎన్‌ పురం కాలనీ వద్ద ధాన్యం ఆరబెడుతున్న సుబ్బయ్య

నరసన్నపేట: అకాల వర్షాలు రైతులను దెబ్బతీశాయి. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వర్షానికి తడిచిపోయింది. మండలంలో కరగాం, లింగాలపాడు, యారబాడు, కోమర్తి, మతలబుప్పేట, చిక్కాలవలస తదితర గ్రామాల్లో ధాన్యం బాగా తడిచిపోయింది.

నేలకొరిగిన అరటి



రణస్థలం: నేలకొరిగిన అరటి పంట

రణస్థలం: అకాల వర్షాలకు అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది. మండలంలోని నారువ గ్రామంలో సుమారు 40 ఎకరాలకు పైగా అరటి తోటలు నేలకొరిగాయి. చిల్లపేట రాజాంలో కొంతమేర అరటి పంటకు నష్టం వాటిల్లింది.



నేలకొరిగిన ట్రాఫిక్‌ పోస్ట్‌

నేలకొరిగిన ట్రాఫిక్‌ పోస్ట్‌

శ్రీకాకుళం క్రైమ్‌ : బుధవారం వేకువజామున వీచిన భారీ గాలులకు జిల్లాకేంద్రంలోని డేఅండ్‌ నైట్‌ కూడలిలో ట్రాఫిక్‌ పోస్ట్‌ నేలకొరిగింది. ట్రాఫిక్‌ సీఐ నాగరాజు ఆదేశాలతో వెంటనే దాన్ని యథాస్థితికి సిబ్బంది అమర్చారు.

క్లుప్తంగా

చీమలమందు తాగి మహిళ ఆత్మహత్య

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామానికి చెందిన పినిమింటి లక్ష్మీ(37) చీమల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ భర్త రామారావు రోజు మద్యం సేవించి భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. ఇంట్లో దాచి పెట్టిన డబ్బులను ఈ నెల 27న తీసుకుపోయి రోజంతా పూటుగా తాగి సాయంత్రం ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. మనస్థాపానికి గురైన లక్ష్మీ ఇంట్లో ఉన్న చీమల మందును నీటిలో కలుపుకొని తాగింది. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. లక్ష్మీకి కుమార్తె జగదీశ్వరి, కుమారుడు శ్యాం ఉన్నారు.

లారీని ఢీకొట్టిన కారు



ఘటనా స్థలంలో ట్యాంకర్, కారు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు జాతీయ రహదారి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కోల్‌కతా నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న అజయ్‌మిశ్రా

శ్రీకాకుళం కల్చరల్: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలంగాణ – ఆంధ్ర సబ్ ఏరియా హెడ్ క్వార్టర్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అజయ్ మిశ్రా అన్నారు. జిల్లాలో బుధవారం పర్యటించిన ఆయన కొత్త రోడ్డు వద్ద ఆర్మీ క్యాంటీన్‌ని సందర్శించారు. మాజీ సైనికులకు, వీర నారీమణులకు ఉపయోగపడేలా ఈ-రిక్షా ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సింహద్వారం దగ్గర ఉన్న ఎక్స్ సర్వీసుమెన్ కంట్రిబ్యూటరి హెల్త్ స్కీమ్ పోలిక్లినిక్‌ని సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సైనికులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా ఆర్మీ వైఫ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యామాంజలి మిశ్రా, కల్నల్ విక్రాంత్ పాండే, కల్నల్ ఆర్.ఎస్.ముతలిక్, డిస్ట్రిక్ట్ ఎక్స్‌సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శైలజ, ఇ.సి.హెచ్.ఎస్. అధికారి, విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ బి.చంద్రశేఖర్, శ్రీకాకుళం క్యాంటీన్ మేనేజర్ విశ్రాంత సుబేదార్ మేజర్ పి.గోవిందరావు, విజయనగరం జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు, శ్రీకాకుళం అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం, ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

బసవన్నకు నివాళులు


బసవన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కుల, వర్ణ, లింగ భేదాలను వ్యతిరేకించిన మహాత్మ బసవేశ్వర తత్వాలు దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బసవన్న జయంతి వేడుకలు నిర్వహించారు. బసవన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బసవన్న 12వ శతాబ్దపు తత్వవేత్తగా సమానత్వాన్ని బోధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వరరావు, టూరిజం అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందాం రా..!

- నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో నెలరోజుల పాటు శిక్షణ
- 22 క్రీడాంశాలకు చోటు
- 8 ఏళ్లు పైబడిన బాలబాలికలకు అవకాశం


సాఫ్ట్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు


వాలీబాల్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో బాలబాలికలంతా మైదానబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఏడాదంతా పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులంతా మరో నెల రోజులపాటు ఆటల్లో మునిగితేలనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు(సమ్మర్ కోచింగ్ క్యాంప్)లను నిర్వహిస్తున్న విషయం విదితమే. జిల్లాలో గురువారం నుంచి శిక్షణా శిబిరాలు మొదలుకానున్నాయి.

అరకొర నిధులతోనే..

మే ఒకటి నుంచి మొదలుకానున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు విదిల్చి చేతులు దులుపేసుకుంది. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలలో మే నెలాఖరు వరకు ఈ శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నారు. ఒక్కొక్క శిబిరానికి కేవలం రూ.7వేలు మాత్రమే కేటాయించారు. ఇందులో శిక్షకుడు/కోచ్‌కు రూ.1500, ఫ్లెక్సీకి రూ.500, స్పోర్ట్స్ మెటీరియల్‌కు రూ.5వేలు వెచ్చించనున్నారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు పోటీలను నిర్వహిస్తారు. ఆఖర్లో ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తారు. అరకొరగా నిధుల కేటాయింపు పట్ల క్రీడాసంఘాల ప్రతినిధులు పెదవివిరిస్తున్నారు.

ఇవీ విధివిధానాలు..

- సమ్మర్ కోచింగ్ క్యాంపులలో 8 నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలకు శిక్షణ అందిస్తారు. 16 ఏళ్ల పైబడి ఆసక్తి కలిగినవారు కూడా హాజరుకావచ్చు.
- ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మరలా సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుంది.
- శాప్ కోచ్‌లతోపాటు పీడీలు/పీఈటీలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ అందించేందుకు అర్హులు.
- ప్రతిరోజు క్రీడాకారులకు హాజరు వేయాల్సి ఉంటుంది.
- వారంతాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రోత్సహించాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



బాలబాలికల ప్రతిభ బయటపడేది వేసవి క్రీడా శిక్షణా శిబిరాలలోనే. జాతీయస్థాయిలో తీర్చిదిద్దే శిక్షకులు జిల్లాలో ఉన్నారు. క్రమం తప్పకుండా హాజరై శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలి. ఒలింపిక్ అసోసియేషన్, క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ నాయకులతో కలిసి శిక్షణా కేంద్రాలను కేటాయించాం. కేంద్రానికి రూ.7వేలు చొప్పున కేటాయించారు. ఇందుకు సంబంధించిన విదివిధానాలను శాప్ ప్రకటించింది.

– డాక్టర్ కె.శ్రీధర్‌రావు,
డీఎస్‌డీఓ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, శ్రీకాకుళం

- శిబిరాల సమయంలో గ్రామీణ, పాఠశాల స్థాయి స్పోర్ట్స్ క్లబ్‌లను క్రీడాంశాల వారీగా ఏర్పాటు చేయాలి.
- శిక్షణా శిబిరాల సమయంలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి, వారిని ప్రత్యేకంగా సానబెట్టి భవిష్యత్తులో జరిగే పోటీలకు సిద్ధంచేయాలి.
- దాతల సహకారం, చేయూతతో శిక్షణా శిబిరాలకు హాజరయ్యే బాలబాలికలకు క్రీడాపరికరాలు, క్రీడాదుస్తులు, షూ, సాక్సులు, స్నాక్స్, మెడల్స్, బహుమతులు, అందించేలా ఆయా కేంద్రాల శిక్షకులు చొరవ తీసుకోవాలి.

శిబిరాలు ఎక్కడెక్కడంటే..

అథ్లెటిక్స్: జీహెచ్ స్కూల్ పలాస- 9494379648, టెక్కలి- 9492417570, జెడ్పీహెచ్ స్కూల్ కేకే రాజపురం- 8464906752, టీపీఎంహెచ్ స్కూల్ శ్రీకాకుళం- 8500271575, కేవీకే ఇచ్ఛాపురం - 9441024555, పాతపట్నం- 9100736583, జెడ్పీహెచ్ స్కూల్- 8688872304.
వాలీబాల్: జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట- 9441011391, జెడ్పీహెచ్ స్కూల్ పైడి భీమవరం- 9849326018, జెడ్పీహెచ్ స్కూల్ ప్రగడపుట్టుగ- 9491569394, జెడ్పీహెచ్ స్కూల్ కొర్ని- 9440955034, జెడ్పీహెచ్ స్కూల్ మాకివలస- 9963753719, జెడ్పీహెచ్ స్కూల్ పాతపట్నం- 9440955034, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బారువ- 9494814087.
కబడ్డీ: బలగ శ్రీకాకుళం - 9010406706, జెడ్పీహెచ్ స్కూల్ సింగుపురం- 9642287746, ప్రభుత్వ డిగ్రీ కళాశాల టెక్కలి- 9441262515, జెడ్పీహెచ్ స్కూల్ పల్లె సారధి- 9502983175.
ఖోఖో: జెడ్పీహెచ్ స్కూల్ పలాస- 9618583449, కేఆర్ స్టేడియం శ్రీకాకుళం- 9866288802, ఎంజీహెచ్ స్కూల్ ఇచ్ఛాపురం- 9177914135.
హ్యాండ్‌బాల్: జెడ్పీహెచ్ స్కూల్ అల్లినగరం- 9493764447, జెడ్పీహెచ్ స్కూల్ పిల్లలవలస- 9966849462, జెడ్పీహెచ్ స్కూల్ పాతటెక్కలి- 7330831517.
సాఫ్ట్‌బాల్: జెడ్పీహెచ్ స్కూల్ ఇప్పిలి- 9440436317, జెడ్పీహెచ్ స్కూల్ కేశవరావుపేట- 9705302968, జెడ్పీహెచ్ స్కూల్ కురుడు- 9052500720.
ఫుట్‌బాల్: కేఆర్ స్టేడియం శ్రీకాకుళం- 9533691018, కలెక్టరేట్ వద్ద ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ హెచ్-గ్రౌండ్ శ్రీకాకుళం- 9177564623, జెడ్పీహెచ్ స్కూల్ నరసన్నపేట- 8639629920.
బాల్ బ్యాడ్మింటన్: జీహెచ్ స్కూల్ ఎచ్చెర్ల- 8074452351, ఎంజేపీ నరసన్నపేట- 7013473337.
బాక్సింగ్: ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్,శ్రీకాకుళం- 8977496979, పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ శ్రీకాకుళం- 9989364548.
జూడో: జెడ్పీహెచ్ స్కూల్, వప్పంగి- 9440688828, జెడ్పీహెచ్ స్కూల్ పోలవరం - 9550743035.
తైక్వాండో: ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణం శ్రీకాకుళం- 9393178455, టౌన్ హాల్ శ్రీకాకుళం- 8919591487.
వెయిట్ లిఫ్టింగ్: జీహెచ్ స్కూల్ నరసన్నపేట: 9492299769, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమదాలవలస- 9390745150.
బ్యాడ్మింటన్: టెక్కలి- 7799335725
బేస్‌బాల్: జెడ్పీహెచ్ స్కూల్ లావేరు- 8639000705.
బాస్కెట్‌బాల్: టెక్కలి- 8986951096.
చెస్: కోడిరామ్మూర్తి (కేఆర్) స్టేడియం శ్రీకాకుళం - 9908162634.
క్రికెట్: పాతపట్నం- 9701454500.
ఫెన్సింగ్: టౌన్‌హాల్ శ్రీకాకుళం- 7660874844.
సెపక్‌తక్రా: ఎన్టీఆర్ఎం హెచ్‌స్కూల్ శ్రీకాకుళం- 8500828965.
టేబుల్‌టెన్నిస్: బాలభాను విద్యాలయం - 9290577033.
టెన్నికాయిట్: జీహెచ్‌స్కూల్ పలాస- 9441089592.
ఉషూ: ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం శ్రీకాకుళం- 9885734313.

గ్రామీణ క్రీడలకు పెద్దపీట..

సమ్మర్ కోచింగ్ క్యాంప్ కేటాయింపులో గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలను కేటాయించారు. అత్యధికంగా అథ్లెటిక్స్‌కు, వాలీబాల్‌కు ఏడేసి చొప్పున కేంద్రాలను కేటాయించగా.. కబడ్డీ 4, ఫుట్‌బాల్ 3, హ్యాండ్‌బాల్ 3, సాఫ్ట్‌బాల్ 3, ఖోఖో 3, బాల్ బ్యాడ్మింటన్ 2, బాక్సింగ్ 2, జూడో 2, తైక్వాండో 2, వెయిట్‌లిఫ్టింగ్ 2, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, చెస్, క్రికెట్, ఫెన్సింగ్, సెపక్‌తక్రా, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్, ఉషూ క్రీడాంశాల్లో చెరో కేంద్రం చొప్పున శిక్షణా శిబిరాలను నిర్వహించనున్నారు. అత్యంత ఆదరణ కలిగిన ఆయా ప్రాంతాల్లో పాఠశాలల మైదానాల్లోనే శిక్షణ అందించనున్నారు.

వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతనాలు పెంచాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు, వీఆర్‌ఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలకు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా పేస్కేల్ జీతాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లులు డ్యూటీలు రద్దుచేయాలని, డీఏను జీతంలో కలపాలని, వీఆర్వో, అటెండర్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మేన్, డ్రైవర్ ఖాళీ పోస్టుల్లో అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు ఆర్అండ్‌బీ అతిథి గృహం రోడ్డు నుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఎస్.సీతప్పడు, బి.అప్పారావు, జి.రామ్మూర్తి, కె.లక్ష్మణ, ఎం.రాముడు, బి.రాములమ్మ, ఢిల్లీశ్వరరావు, రాంబాబు, పద్మ, మీనాక్షి, రాజులమ్మ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఔషధాలే లక్ష్యం

శ్రీకాకుళం క్రైమ్ : ప్రభుత్వం నిర్దేశించిన ధరలలో ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా జిల్లా ఔషధ నియంత్రణ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఏడీ చంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా మానవ, పశు సంబంధిత మందులు దొరికే ప్రభుత్వ, ప్రయివేటు దుకాణాల్లో నమూనాలను సేకరించి విజయవాడ, కోలకత్తా వంటి చోట్లకు పంపించి విశ్లేషణ చేయిస్తున్నామని చెప్పారు. రెండేళ్లలో 327 శాంపిళ్లు సేకరించి విశ్లేషించగా ఏడు రకాల మందులలో నాణ్యతలోపం గుర్తించామన్నారు. వాటిని తయారుచేస్తున్న ఐదు కంపెనీలపై జిల్లాలోని వివధ కోర్టుల్లో కేసులు నడుస్తుండగా, కొన్ని కేసుల్లో దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

టెండర్ షెడ్యూల్లో మార్పులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పౌరసరఫరాల సంస్థకు చెందిన 14 మండల స్థాయి. గోదాములలో పి.డి.ఎస్.బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను రెండో దశ రవాణాకు వేసిన టెండరు షెడ్యూల్లో మార్పులు చేస్తున్నట్టు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలపారు. వివరాలకు సహాయ మేనేజరు 7732098637 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రిటైర్డ్ పోలీసులకు సత్కారం


ఆఫీస్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి బుధవారం ఉద్యోగ విరమణ పొందినవారిని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలైన ట్రాఫిక్ ఎస్‌ఐ వి.దేవదానం, ఆఫీస్ సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, వజ్రపుకొత్తూరు ఏఎస్‌ఐ ఎస్.అప్పలనాయుడు, ఏఆర్ హెచ్‌సీ ఎస్.చిన్నబాబులకు ఎస్పీ దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్ గోపినాథ్, ఏఆర్ ఆర్ఐ నర్సింగరావు, కార్యాలయ సూపరింటెండెంట్లు బాలరాజు, లిల్లీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్


ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఇటీవల జరిగిన సీఎం చంద్రబాబునాయుడు పర్యటన పూర్తిగా తప్పుడు ప్రచారాల మీదే ఆధారపడిందని తప్ప జిల్లాకు ఒరిగిందేమి లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తక్కువ చేయాలని చూసిన చంద్రబాబు, నిజాలను పూర్తిగా మర్చిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొచ్చిన వాస్తవాన్ని ఆయన గానీ, ఆయన పార్టీ నాయకులు గానీ గుర్తించకపోవడం దారుణమన్నారు. భావనపాడు పోర్టు విషయంలో చంద్రబాబు చేస్తున్న ప్రచారం అర్థరహితమన్నారు. పోర్టుకు భూముల సేకరణ, పునరావాస పనులు వంటి అన్ని పనులు వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ, మత్స్యకార భరోసా, బీమా ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకొచ్చింది జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేయటానికి ముందు 14 ఏళ్ల టీడీపీ పాలనలో ప్రజల కోసం ఏం చేసారో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. హామీలిచ్చి విస్మరించడం సరికాదన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించి అవమానిస్తారా?


సమావేశం నుంచి వెళ్లిపోతున్న చైర్మన్ గిరిబాబు, కౌన్సిలర్లు

- పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ తీరుపై చైర్మన్ ఆగ్రహం
- ఏక చత్రాధిపత్యం వహిస్తున్నారంటూ సభ వాయిదా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం అర్ధాంతరంగా వాయిదా పడింది. మున్సిపల్ కమిషనర్ రామారావు ప్రొటోకాల్ ఉల్లంఘించి తనను అవమానించారని చైర్మన్ బల్ల గిరిబాబు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ వాయిదా వేసి వెళ్లిపోయారు. మున్సిపల్ సమావేశం ప్రారంభంలో చైర్మన్ తాగునీటి సమస్యపై ప్రారంభ ఉపన్యాసం చేశారు. అనంతరం బోర్లు, పవర్ బోర్లు ఏర్పాటు అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో చైర్మన్ ఒక్కసారిగా కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న 26వ వార్డులో ఇటీవల పవర్ బోరును కమిషనర్, టీడీపీ కౌన్సిలర్ శంకుస్థాపన చేసుకున్నారని, కనీసం తనకు సమాచారం ఇవ్వలేదని, కమిషనరే ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే ఇక తానెందుకని మండిపడ్డారు. ఇటీవల ప్రొటోకాల్ పాటించకుండా పలు కార్యక్రమాలు చేపడుతున్నారని, అలాంటప్పుడు 31 మంది కౌన్సిలర్లు, అధికారులతో సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం తమకేం ఉందని, కమిషనర్ ఏకచత్రాధిపతిగా పాలన సాగించుకోవాలంటూ బయటకు వెళ్లిపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు కూడా సమావేశం నుంచి వెళ్లిపోయారు.



సదరం కలకలం

- మళ్లీ వెలుగులోకి తప్పుడు ధ్రువపత్రాల జారీ వ్యవహారం
- నరసన్నపేటలో నలుగురు ప్రభుత్వ వైద్యులపై కేసు నమోదు
- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన పోలీసులు

మాకేంటి సంబంధం?

సదరంలో స్లాట్ బుక్ చేసుకున్న వారిని పరిశీలించి వారు అంగవైకల్యం కలిగి ఉన్నదీ లేనిదీ ఆర్థో వైద్యులు నిర్ధారిస్తారని, తాము కమిటీ సభ్యులుగా కౌంటర్ సంతకాలు చేశామే తప్ప ఇందులో తమకు ఎటువంటి సంబంధం లేదని జయశ్రీ, నాగమల్లేశ్వరి, నవీన్ అంటున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా వివరించినప్పటికీ కేసు నమోదు కావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ కేసు నమోదు తర్వాత దర్యాప్తు జరుగుతుందని, ఎవరు దోషులనేది విచారణ పూర్తయ్యాక తెలుస్తుందని చెప్పారు.

నరసన్నపేట: వికలాంగత్వం నిర్ధారించేందుకు ఉద్దేశించిన సదరం సర్టిఫికెట్లకు సంబంధించి తప్పుడు ధ్రువపత్రాల జారీ వ్యవహారం నరసన్నపేటలో కలకలం రేపుతోంది. పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన 24 మందికి వికలాంగ సర్టిఫికెట్ల జారీ వ్యవహారం తాజాగా పోలీసు కేసు నమోదుకు దారి తీసింది. లోకాయుక్త ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి నలుగురు ప్రభుత్వ వైద్యులు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..

2023లో నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో సదరం స్లాట్ బుక్ చేసుకున్న తోలాపి గ్రామానికి చెందిన 24 మందికి సర్టిఫికెట్లు జారీ చేశారు. అయితే ఈ ధ్రువపత్రాలు తప్పుడవని, అంగవైకల్యం లేకపోయినా సర్టిఫికెట్లు ఇచ్చారని, దీంతో అనర్హులు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారని అప్పట్లో అదే గ్రామానికి చెందిన పొన్నాడ అప్పారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందనలో అప్పటి కలెక్టర్‌కు ఈ వ్యవహారంపై వివరించారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల మేరకు 2023 ఆగస్టు 8న టెక్కలి ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యారావు ఆధ్వర్యంలో



ముగ్గురు కమిటీ సభ్యులు నరసన్నపేటలో విచారణ చేపట్టారు. 24 మందిలో ఇద్దరు మాత్రమే వైకల్యంతో ఉన్నారని, మిగిలిన 22 మందికి తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చారని దర్యాప్తులో నిర్ధారించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అప్పటి జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రాజ్యలక్ష్మి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయితే అప్పట్లో కేసు నమోదు చేయలేదు. దీనిపై అప్పారావు తదితరులు లోకాయుక్తకు వెళ్లగా ఈ వ్యవహారంపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని పోలీసులను వివరణ కోరినట్లు సమాచారం. దీంతో ఒక్కసారిగా కదిలిన పోలీసు యంత్రాంగం ప్రస్తుత డీసీహెచ్ కల్యాణ్‌బాబు నుంచి వివరాలు తీసుకొని రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో ఆదరాబాదరాగా మంగళవారం రాత్రి నరసన్నపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తప్పుడు ధ్రువపత్రాలు జారీ చేసిన ఆర్థోపెడిక్ వైద్యుడు చల్ల రవికిరణ్, ఈ సర్టిఫికెట్లపై కౌంటర్ సంతకాలు చేసిన అప్పటి ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.జయశ్రీ, కమిటీ సభ్యులు డాక్టర్ నాగమల్లేశ్వరి, బి.నవీన్‌లతో పాటు అప్పటి డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎస్.శ్రీనివాసరావులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ స్థానిక విలేకరులకు బుధవారం వివరాలు వెల్లడించారు. ప్రస్తుత డీసీహెచ్ కళ్యాణ్‌బాబు నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఫిబ్రవరిలో నోటీసులు జారీ..

ఇదే వ్యవహారంపై నలుగురు వైద్యులపై ప్రభుత్వ కార్యదర్శి ఫిబ్రవరి నెలలో నోటీసులు జారీ చేశారు. మీరు తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేశారని, మీపై ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లో సమాధానాలు ఇవ్వాలని ఆదేశించిన విషయం విదితమే. దీనిపై వైద్యులు సమాధానాలు ఇచ్చారు. ఈలోగా లోకాయుక్త సూచనలతో పోలీసులు కేసు నమోదు చేయడంతో వైద్యులు ఆందోళన చెందుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఉదయం ఫలక్‌నామా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటనలో కొత్తపోలవలసకు చెందిన తుంగాన గోవిందరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు కేసు నమోదు చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెళియాపుట్టి: గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీతంపేట ఐటీడీఏ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మెళియాపుట్టి, సీతంపేట గురుకుల జూనియర్ కళాశాల్లో 430 సీట్లకు మే 24న కౌన్సిలింగ్ జరుగుతుందని, మే 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు.

వరకట్న వేధింపులపై కేసులు నమోదు

కాశీబుగ్గ: పలాస మండలం, మున్సిపాలిటీ పరిధిలో వరకట్న వేధింపులపై కేసులు నమోదు చేసినట్లు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన కె.ఇందు తన భర్త మహేష్, భర్త కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా, పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన రేఖమ్మ తన భర్త కైలష్‌హోరి రూ.3లక్షలు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.